# ఆర్జవ జీవులు

## 1

"అమ్మోయ్, నొప్పి" అంటూ పొత్తి కడుపు మీద డాక్టరు చేతిని పక్కకు తోసేసింది తాయారమ్మ. "పచ్చి పుండులా ఉంది బాబూ."

అసంకల్ప ప్రతీకార చర్యలా నా చేతిని గభిమని పక్కకి లాగేసేను. కాని పరీక్ష అర్థాంతరంగా ఇలా ఆపెస్తే రోగ నిర్ణయం జరిగేదెలా?

"అమ్మా, మీరు ఒక్క క్షణం ఓపిక పట్టాలి" అని సముదాయించి, మరొక్క సారి పొత్తి కడుపు కుడి వైపు నెమ్మదిగా నొక్కి చూసేను. ఒక్క సారి కెవ్వుమని కేక వేసింది, ఏభయ్యో పడిలో పడుతూన్న తాయారమ్మ.

ఇక సందేహం లేదు. ఇది ఎపెండిసైటిస్. గాంధీ గారికి జైలులో ఎపెండిసైటిస్ రావడం వల్ల మన దేశంలో ఈ మాట వినని వాళ్లు అరుదు.

'ఎపెండిక్స్' అంటే క్రిమిక. 'అయిటిస్' అంటే వాపు. కనుక 'ఎపెండిసైటిస్' అంటే క్రిమిక వాచడం అని అర్థం. మనం తిన్న ఆహారం చిన్న ప్రేగులలో పూర్తిగా జీర్ణ అయిన తర్వాత పిప్పి పదార్థాలు పెద్ద ప్రేగులలోకి ప్రవేశించే ముఖద్వారం దగ్గర ఉంటుందీ క్రిమిక. చూడ్డానికి చిన్న వానపాములా ఉంటుంది. అప్పుడప్పుడు అసంకల్పంగా, ఆంత్రోచ్ఛిష్టమైన ఆహార ఉలూఖలాలు ఈ క్రిమిక దగ్గర చిక్కుకుంటే, ఈ క్రిమికకి చీము పట్టి వాచుతుంది. వెను వెంటనే శస్త్రచికిత్స చేసి, కోసి వెయ్యకపోతే ఆ క్రిమిక చితుకుతుంది. అది ప్రాణాపాయకరమైన పరిస్థితి. అందుకని సర్జన్‌కి కబురు పంపేను. ఆయన కూడ పరీక్ష చేసి, ఇది ఎపెండిసైటిస్ అని రూఢి చేసేస్తే అప్పుడు ఆపరేషన్ చేస్తారు.

అమెరికాలో చాల ఆసుపత్రులలో 'ఎమర్జెన్సీ' గది అని ఒక గది ఉంటుంది. ప్రమాదం ముంచుకొస్తున్నాదని అనుమానం ఉన్న కేసులన్నిటినీ ముందు ఈ ఎమర్జెన్సీ గదికి తీసుకొస్తారు. తుపాకి దెబ్బలకి, కత్తిపోట్లకి క్షతగాత్రులయిన వాళ్లు, డ్రగ్గులని దుర్వినియోగం చేసి కొరివితో తల గోక్కున్న వాళ్లు, ఇలా రకరకాల ప్రజానీకంతో, చేపల బజారులా ఎల్లప్పుడు రద్దీగానే ఉంటుంది. రోగ నిర్ణయం చెయ్యగలిగినంత చేసి, చేతనయిన ప్రథమ చికిత్స చేసి, ఏ నైపుణ్యం ఉన్న వైద్యుడు అవసరమో నిర్ణయం చేసి, ఆ వైద్యుడిని పిలిపించడం మొదలయిన పనులతో ఎమర్జెన్సీ గదిలో సిబ్బంది ఇరవయి నాలుగు గంటలూ ఊపిరి తిరగని పనులతో సతమతమవుతూ ఉంటారు.

ఆపరేషన్ అనగానే తాయారమ్మ, ఆవిడని ఆసుపత్రికి తీసుకొచ్చిన కొడుకూ కొంచెం కంగారు పడ్డారు. భయపడవలసిన అవసరం లేదనిన్నీ, ఇది రివాజుగా చేసే శస్త్ర పరిక్రియేననీ ధైర్యం చెప్పి అక్కడ నుండి మరొక రోగిని చూద్దామని వెనక్కి తిరిగి వెళ్లబోతూ ఉంటే, నా తెల్లకోటు పట్టుకుని తాయారమ్మ వెనక్కి లాగింది.

"నాయన్నాయనవి కాదూ. అందాకా ఈ నొప్పి తగ్గడానికి ఏదయినా మాత్ర ఇయ్య బాబూ" అని ప్రాధేయ పడుతూ బతిమాలింది.

"లేదమ్మా, సర్జన్ వచ్చి ఇది ఎపెండిసైటిస్ అని రూఢి చేసే వరకు మరే మందూ ఇవ్వడానికి వీలు లేదు. మందుతో నొప్పిని కప్పెడితే అసలు రోగం ఏమిటో తెలియకుండా పోయే సావకాశం ఉంది. ఒక్క నిమిషం భరించండి." అని నచ్చ చెప్పి, తాయారమ్మ ఛార్టుని మరొక సారి చదవడానికి నర్సులు ఉండే బల్ల దగ్గరకి వెళ్లేను.

ఇది అమెరికాలో నాకు తగిలిన తొలి తెలుగు కేసు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో చదువు వెలగబెట్టి, హౌస్ సర్జన్ అయిన తర్వాత, ఇ.సీ.ఎఫ్. ఎమ్. జీ. పరీక్ష రాసేసి
సరాసరి అమెరికా వచ్చేను. ఇన్నాళ్ళకి తెలుగు వాళ్లు తారస పడ్డారు. ఏదో మన వాళ్లే కదా అని మరి కొంచెం పూనుకుని చూస్తున్నాను.

తాయారమ్మ టెంపరేచరు 101 డిగ్రీలమీద మరొక్క పిసరు ఉంది. తెల్ల కణాల లెక్క 19, 000 దాటింది. ఆరోగ్యంగా ఉన్న వాళ్లకి ఈ లెక్క 4, 300 కి 10, 800 కి మధ్య ఉంటుంది. లెక్క 19, 000 అంటే ఒంట్లో ఎక్కడో సోకుడు – అంటే ఇన్ఫెక్షన్ – పట్టి ఉండాలి. మెక్‌బర్నీ బిందువు (ఇది బొడ్డుకీ, తుంటి ఎముకకీ మధ్యస్థంగా, కుడి వైపు పొత్తి కడుపు మీద ఉండే ప్రదేశం) మెత్తగా ఉండి ముట్టుకోగానే మొర్రో మంటున్నాది తాయారమ్మ. పక్కనే ఉన్న ఆఫీసులోకి వెళ్లి, బీరువా లోంచి పుస్తకం తీసి, మరొకసారి పేజీలు తిప్పి చూసేను. క్రిమిక వాచినప్పుడు ఆ క్రిమిక వెళ్లి ఈ మెక్‌బర్నీ బిందువు ఉన్న స్థావరంలో పొత్తికడుపు గోడలకున్న నరాలని తాకుతుంది. అందుకే అక్కడ చెయ్యి పెట్టగానే కెవ్వుమని కేక వేసింది తాయారమ్మ. నేను చేసిన రోగ నిర్ణయం సరి అయినదే అని మరొకసారి మననం చేసుకుని, మళ్లా నర్సులు ఉన్న బల్ల దగ్గరకి వస్తూ ఉంటే – నేను పంపిన కబురుకి సమాధానంగా వచ్చినట్లున్నారు – ముగ్గురు సర్జన్‌లు తాయారమ్మ చుట్టూ మూగి పరీక్షిస్తూ కనిపించేరు.

ఇంతలోనో ఇహలోనో వీళ్లు తాయారమ్మని ఆపరేషన్ గదిలోకి తీసుకెళతారు అని నాలో నేను అనుకుంటూ ఉండగానే సర్జికల్ రెసిడెంటు నా దగ్గరకి వచ్చి, నా బుజం మీద చేత్తో తట్టి అన్నాడు.

''చూడు, రావూ! ఆవిడ పొట్ట పచ్చి పుండులా ఉన్న మాట నిజమే. ఆసుపత్రిలో వెంటనే చేర్పించాలి. అదీ నిజమే. కాని ఆపరేషను మాత్రం అక్కర లేదోయ్.''

నా ముఖ కళవళికలని గమనించి నేనెక్కడ బాధ పడతానో అని కాబోలు,

''అహా! నువ్వు పరీక్ష చేసినప్పటికీ, ఇప్పటికీ రోగ లక్షణాలలో మార్పు వచ్చి ఉండొచ్చులే. నేను చూసే వేళకి నొప్పి పొట్టకి ఎడం పక్కని, మరీ పొత్తికడుపు దగ్గర కాకుండా, బొడ్డుకి కొంచెం మీదని వస్తోంది. విరేచనాలు కూడ అవుతున్నాయని చెప్పింది. ఇది ఎపెండిసైటిస్ కాదోయ్, ఇది ఎంటెరైటిస్.''

'ఎంట్రెయిల్స్' అంటే చిన్న పేగులు. ఎంటెరైటిస్ అంటే చిన్న పేగుల వాపు. ఈ వాపుని తెలుగులో ఆంత్రశోథ అంటారు. నేను అనుకున్నట్టు ఎపెండిసైటిస్ కాదనేసరికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్వర్ణపతకం గెలుచుకున్న నా అహం కొద్దిగా దెబ్బ తింది. ఎపెండిసైటిస్ అని నేను రోగ నిర్ణయం చేసినప్పుడు కడుపులో ఏది వాచిందో నిర్ధిష్టంగా చెబుతున్నాను. కాని ఎంటెరైటిస్ అంటే వాపు పేగులలో ఎక్కడయినా కావచ్చు. 'మీది ఏ ఊరు? అంటే గోదావరి జిల్లా' అన్నట్లుంది ఇతని వరస. మరి నేనంత తెలివి తక్కువ వాడిని కానని నిరూపించుకుందికా అన్నట్లు

''ఎంటెరయిటిస్ అంటే వాపు ఎక్కడయినా కావచ్చు, అది రోగ నిర్ణయం ఎలా అవుతుంది?'' అని మాట నమిలేను.

''ప్రస్తుతానికి అంత కంటె నేనూ ఏదీ చెప్పలేనోయ్. తెల్లకణాల లెక్క మరీ అంత ఎక్కువగా ఉండడం మంచి లక్షణం కాదు. నువ్వు చెప్పినట్లు ఆసుపత్రిలో తప్పకుండా చేర్పించి మన పర్యవేక్షణలో ఉంచాలి. కాని కత్తి కోత అక్కర లేదు'' అని చెప్పి అక్కడనుండి జరజరా మరొక కేసు చూడడానికి వెళ్లి పోయేడు.

చేసేది, చెయ్యగలిగేది ఏదీ లేక తెల్లకోటు ఒకసారి సర్దుకుని, మనస్సులోని భావాన్ని బయటకు వెళ్లగక్కకుండా, మరొక సారి పరీక్ష చేసే నెపంతో తాయారమ్మ దగ్గరకి వెళ్లి, ''ఇప్పుడు నొప్పి ఎలా ఉంది'' అని అడిగి,

''తాయారమ్మగారూ! మరేమీ భయపడకండి. ఒక మంచి వార్త, ఒక చెడ్డ వార్త చెప్పడానికి వచ్చేను. మంచి వార్త ఏమిటంటే మూడొంతులు ఆపరేషన్ అక్కర లేదని పెద్ద డాక్టరు గారు చెబుతున్నారు. చెడ్డ వార్త ఏమిటంటే మీకు వచ్చిన జబ్బు ఏమిటో అంతూ, పై తెలియడం లేదు. మీరు 'నొప్పి, నొప్పి' అని అరవకుండా, కొంచెం కుదురుగా ఉండి నేను అడిగిన ప్రశ్నలకి సమధానాలు చెపితే, మీ బాధ తగ్గించడానికి ప్రయత్నం చేస్తాను.''

తన పొట్ట మీద చేత్తో తనే నొక్కుకుని, ''అబ్బే! ఇప్పుడు అంత నొప్పిగా లేనే లేదు. అడుగు నాయనా, చెబుతాను'' అంది తాయారమ్మ.

కడుపులో వికారం, విరేచనాలు, వాంతులు, మొదలయినవన్నీ క్రిమిక శోఫ లక్షణాలే. అందువల్ల ఎపెండిసైటిస్ రోగ నిర్ణయం అంత అనాయాసంగా జరిగే పని కాదు. అంతే కాదు. మూత్రపిండాలకి గాని, పిత్తాశయానికి గాని రోగం వచ్చినా, ఇంకా మరెన్నో కారణాలవల్ల గాని ఎపెండిసైటిస్ లక్షణాలు పొడచూపే సావకాశాలు ఉన్నాయి. అందుకని తాయారమ్మ గారిని మరొక కోణం నుండి పరీక్షించడం మొదలు పెట్టేను.

''అప్పుడప్పుడు ఉబ్బసం వస్తూ ఉంటుందని చెప్పేరు కదా, మందు ఏదయినా తీసుకుంటున్నారా?''

'''ప్రొవిన్‌టిల్ ఇన్‌హేలర్' వాడుతోందండి. మరీ ఎక్కువగా వస్తే స్టీరాయిడ్ మాత్రలు వేసుకుంటోందండి.'' తల్లి తరఫున కొడుకు సమాధానం చెప్పేడు.

ఉబ్బసం ఉన్న వాళ్లకి వ్యాధి విజృంభించినప్పుడల్లా ఎగ ఊపిరి వస్తుంది. దీనికి కారణం ఏమిటంటే ఊపిరితిత్తులలో ఉండే శ్వాసనాళికలలోని గాలిదారులు ముకుళించుకు పోవడమే. ఇలా ఇరుకయిపోయిన మార్గాలని విప్పారించడానికి 'ఇన్‌హేలర్' రామబాణంలా పనిచేస్తుంది. ఇన్‌హేలర్ అంటే మరేమీ కాదు. చిన్న గొట్టంలా ఉంటుంది. అది నోట్లో పెట్టుకుని గట్టిగా లోపలికి పీల్చితే, గొట్టంలో ఉన్న 'ప్రొవిన్‌టిల్' అనే మందు ఛాతీలోకి వెళుతుంది. అప్పుడు గురక ఉపశమించి, గాలి పీల్చడం కొంత తేలిక అవుతుంది.

ఇక 'స్టీరాయిడ్' గురించి మరొక చిన్న పాఠం. 'స్టీరాయిడ్' ని తెలుగులో ఘృతార్థం అంటారు; అంటే నెయ్యిని పోలిన కొవ్వు పదార్థం అని అర్థం. ఇదొక రసాయనం. దీని గొప్పతనం ఏమిటంటే ఇది వాపుని కలుగజేసే పదార్థాల ఉత్పత్తిని ఆపుతుంది. కనుక స్టీరాయిడ్‌ల సహాయంతో రకరకాల వాపులని అరికట్ట వచ్చు. కాని అత్యవసర పరిస్థితులలో తప్ప స్టీరాయిడ్‌లని అతిగా వాడడం అంత మంచిది కాదు. స్టీరాయిడ్‌లకి అలవాటు పడ్డ శరీరం రోగాలని ఎదిరించి పోరాడ లేదు. అప్పుడు మొదటికే మోసం కదా! అందుకని రోగం విజృంభించినప్పుడు మాత్రం ఈ ఘృతార్థాలని వాడి, దైనందిన అవసరాలకి ఇన్‌హేలరు వాడతారు.

''అంతేనా, ఇంకా ఏమయినా మందులు వాడుతున్నారా?''

''ఆమధ్య 'బ్రాంకైటిస్' కి 'ఏంటీబయాటిక్స్' వాడమంటే వాడేమండి'' తాయారమ్మ తనయుడు చెప్పేడు.

''ఆ విషయం ఇంతవరకు చెప్పలేదేమి?'' నేను చేసిన తప్పుడు రోగనిర్ణయానికి రోగిదే బాధ్యత అని అర్థం స్ఫురించేలా ధ్వనించిందా ప్రశ్న. ''ఆ ఏంటీబయాటిక్ పేరేమిటో తెలుసా?''

''పేరు జ్ఞాపకం రావడం లేదండి. తెల్లగా ఉన్నాయి. పెద్ద పెద్ద మాత్రలు.''

''దాని పేరు 'బేక్‌ట్రిమ్' అయి ఉండ వచ్చా?''

''అవునండి. అదేనండి. మీరు అనగానే గుర్తుకొచ్చింది.''

''విరేచనాలు ఎప్పుడు మొదలయాయి?''

''నిన్ననండి. ఈ రోజు బాగా ఎక్కువ అయాయి.''

''నీళ్ల విరేచనాలా? రక్తం పడుతోందా?''

''బుర్రునీళ్లు నాయనా! బిరడా తీసేసిన సీసా అనుకో'' తాయారమ్మే చెప్పింది.

నా మనస్సులో గభిమని ఒక ఆలోచన మెరసింది. కాని ఇందాకటిలా తొందర పడి తప్పు చేస్తే మరి ముఖం చెల్లదు. అందుకనీ, ఎందుకేనా మంచిదనీ మరో రెండు ప్రశ్నలు వేసేను.

''ఈ మధ్య కాని విదేశాలలో ప్రయాణం చేసి వచ్చారా?''

''లేదు నాయనా.''

''ఇండియాలో మీది ఏ ఊరు?''

''మొగల్తుర్రు. మా వారితో కలసి చిన్నతనంలోనే ఈ దేశం వచ్చేసేను. అప్పటికి పద్దెనిమిది ఏళ్లు నిండేయేమో. మా అబ్బాయి,'' కొడుకుని చూపిస్తూ, ''ఈ దేశంలోనే పుట్టేడు....''

తాయారమ్మ ఇంకా ఏవో చెబుతూనే ఉంది. నేను ఆ మాటలు పూర్తి కాకుండానే చకచకా సర్జికల్ రెసిడెంటు దగ్గరకి వెళ్లేను.

''తాయారమ్మ రెండు వారాల కిందట 'బేక్ట్రిన్' వాడిందిట. ఆ విషయం మీకు చెప్పిందా?''

''బుర్ర వంచుకుని ఏదో రాసుకుంటూన్న రెసిడెంటు బుర్ర ఎత్తకుండానే, ''నేనూ అదే అనుకుంటున్నాను'' అని ముక్తసరిగా మూడు మాటలు అన్నాడు.

''అలాగా! అయితే తాయార్మమ్మకి వచ్చినది 'సూడో మెంబ్రేనస్ కోలయిటిస్' అని మీకూ అనుమానంగా ఉందా?''

''ఊహు! ఆ అవకాశం ఉంది. పరీక్ష చేసి చూడండి.''

''సూడో మెంబ్రేనస్ కోలయిటిస్ ఒక మొండి రోగం. పెనిసిలిన్, ఏంపిసిలిన్, కీఫ్లెక్స్ మొదలయిన ఏంటీబయాటిక్కులని విచక్షణ లేకుండా, విచ్చలవిడిగా వాడేస్తే వచ్చే ప్రమాదానికి ఈ సూడో మెంబ్రేనస్ కోలయిటిస్ ఒక చక్కని ఉదాహరణ.

ఏంటీబయాటిక్కుల వాడకం వల్ల మంచితో పాటు కొంచెం చెడు కూడా కలుగుతుంది. ఇదేమిటో సోదాహరణంగా వివరిస్తాను. సావధానంగా చదవండి. ''ఏంటీబయాటిక్స్'' అన్న ఇంగ్లీషు మాటకి ప్రాణాంతకులు లేదా ప్రాణం తీసేవి అని అక్షరాలా అర్థం చెప్పుకోవచ్చు. పొలంలో కలుపు మొక్కలని చంపడానికి మందు జల్లితే కలుపు మొక్కలతో పాటు పైరు మొక్కలు కూడ చచ్చిపోయే ప్రమాదం ఎలా ఉందో అలాగే, ఈ ఏంటీబయాటిక్కులని నిర్లక్ష్యంగా వాడితే ఇవి రోగ కారకులైన సూక్ష్మజీవులని చంపడమే కాకుండా శరీరానికి ఉపయోగ పడే సూక్ష్మ జీవులని కూడ హతమార్చుతాయి. ఈ మందులని, అత్యవసరం కాని పరిస్థితులలో, వైద్యులు విచ్చలవిడిగా వాడడం మొదలు పెడితే శరీరానికి హాని చేసే సూక్ష్మజీవులు వీటికి అలవాటు పడిపోయి క్రమేపీ ఆ మందుకి లొంగడం మాని వేస్తాయి. అది మరీ ప్రమాదం.

అలాగని తప్పంతా వైద్యుల మీదకి తోసెయ్యడమూ న్యాయం కాదు. అవసరమని వైద్యుడు నిశ్చయించినప్పుడు, వైద్యుడు చెప్పినంత కాలం, మోతాదుని తు. చ. తప్పకుండా వాడాలి. మందు వేసుకున్న మూడు రోజులలోనే గుణం కనిపించినా సరే, మందంతా వైద్యుడు వాడమని చెప్పినంత కాలం వాడాలి. అలా వాడక పోతే ఇంకా ప్రమాదం. అదెందుకో చెబుతాను. మన శరీరంలో ఉన్న సూక్ష్మజీవులలో కొంచెం అర్భకంగా ఉన్నవి మందు ధాటీకి ముందు

చచ్చిపోయి, కొంచెం గుణం కనిపించినట్లు అనిపిస్తుంది. అప్పుడు గుణం కనిపించింది కదా అని మందు వేసుకోవడం ఆపేసేమంటే, దృఢంగా ఉన్న సూక్ష్మజీవులు చావవు సరికదా ఈ మందుకి అలవాటు పడిపోయి, ఇంకా దృఢంగా ఉన్న పిల్లలని కంటాయి. అలా బలం పుంజుకున్న సూక్ష్మజీవులు ఒక శరీరం నుండి మరొక శరీరం లోనికి వెళ్లినప్పుడు రోగ నిర్ణయం చేసి మందు వేసే లోగా రోగి ప్రాణం పోవచ్చు.

గుణం కనిపించింది కదా అని మందు వేసుకోవడం మధ్యలో ఆపేయకుండా చెయ్యాలంటే ఒక మార్గం ఉంది. అవసరం ఉన్నంత మందు ఒక్క సారే రోగి చేత కొనిపించడం. ఎలాగా కొన్నాం కదా, ఎందుకు పారేయడం అని మందంతా వాడే వ్యక్తుల ఎడల ఈ చిటకా పని చెయ్యవచ్చు. కాని డాక్టరు అనుకున్నట్లు ఆ మందు పని చెయ్యక పోయిన పక్షంలో మందు మార్చవలసి వస్తే, అప్పుడు, డాక్టరు, మందుల కొట్టువాడు లాలూచీ పడి పేషెంటు చేత అనవసరంగా మందు కొనిపించేరని అపవాదు వస్తుంది. 'తీస్తే మంట, తియ్యక పోతే తంట' అన్న కథ తంతు అనుకోండి ఈ రోజుల్లో వైద్యం చెయ్యడం అంటే.

ఏంటీబయాటిక్సుతో ఈ మధ్య మరొక విచిత్రం జరిగింది. ఒక రకం సూక్ష్మజీవులు మనం మందుగా వాడిన ఏంటీబయాటిక్సునే ఆహారంగా మార్చేసుకుంటున్నాయిట. ఇదే నిజం అయితే మానవ జాతి మనుగడకే ముప్పు. మానవ జాతిలో ముసలం పుట్టినట్లే. మన పుట్టి మునిగి నట్లే!

మన పేగులలో ఎల్లప్పుడూ ఒక రకమైన సూక్ష్మజీవులు స్థావరం ఏర్పరచుకుని ఉంటాయి. ఇవి మనకి హాని చెయ్యవు సరికదా, పైపెచ్చు ఉపకారమే చేస్తాయి. మనం మందు రూపంలో వేసుకున్న ఏంటీబయాటిక్‌లు ఈ నిరపాయమైన సూక్ష్మజీవుల పాలిటి కూడ యములాళ్లలా పని చేస్తాయి. మనకి ఉపకారం చేసే సూక్ష్మజీవులు ఇలా చచ్చిపోగానే, వాటి స్థానంలో ఆషాడభూతిలా మరొక జాతి సూక్ష్మజీవులు చేరడానికి అవకాశం కలుగుతుంది. ఈ ఆషాడభూతుల జాతికి చెందిన ఒక దానిని 'క్లోస్ట్రీడియమ్ డిఫిసీల్' అన్న పేరుతో పిలుస్తారు. ఈ 'క్లోస్ట్రీడియమ్ డిఫిసీల్' మనం తిన్న తిండిలో వాటా పుచ్చుకుని – తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టినట్లు – ఒక విష పదార్థాన్ని విసర్జిస్తాయి. ఈ విష పదార్థపు ప్రభావం వల్ల మన పేగుల లోపలి పొర చివికి పోతుంది. అలా చివికిపోయిన ప్రదేశంలో మరొక దొంగ పొర పెరుగుతుంది. ఈ దొంగ పొరనే ఇంగ్లీషులో 'సూడో మెంబ్రేన్' అంటారు. 'కోలైటిస్' అంటే పేగు వాపు. కనుక 'సూడో మెంబ్రేనస్ కోలైటిస్' అంటే దొంగ పొర వల్ల పేగు వాచడం.

తమాషా ఏమిటంటే, అశ్రద్ధగా ఏంటీబయాటిక్‌లని వాడడం వల్ల సంక్రమించిన
ఈ 'సూడో మెంబ్రేనస్ కోలైటిస్' కి కారణభూతమైన 'క్లోస్ట్రీడియమ్ డిఫిసీల్' ని చంపాలంటే 'ఫ్లేజీల్' అన్న వ్యాపార నామంతో పిలవబడే 'వేంకోమైసిన్' లాంటి
ఏంటీబయాటిక్‌ని వాడాలి. చూశారా! ఈ ఏంటీబయాటిక్‌లని వాడితే ఒక చిక్కు, వాడకపోతే మరొక చిక్కు.

ఏమయితేనేమి, తాయారమ్మ గారిని పట్టి పీడిస్తూన్న రుగ్మత ఏమిటో కొంచెం అర్థం అయింది. కనీసం అయిందని అనుకుంటున్నాను. కనుక నర్సు దగ్గరకి వెళ్లి తాయారమ్మని ఆసుపత్రిలో చేర్పించమని సిఫారసు చేసి, ఆవిడ మలం పరీక్షించమనీ, వెంటనే ఫ్లేజిల్ ఇవ్వమనీ ఉత్తర్వు జారీ చేసి, ''అమ్మయ్య, నెగ్గేమురా'' అనుకుంటూ ఒక సారి గట్టిగా గాలి పీల్చుకుని ఇంటి ముఖం పట్టేను.

ముందు రోజు అలసట నుండి మర్నాటికి తేరుకున్నాను. ఫ్లెజిల్ ప్రభావానికి తాయారమ్మ కూడ తేరుకునే ఉంటుందన్న ధీమాతో ఆసుపత్రిలో అడుగు పెట్టేను. తలుపు తెరచి లోపలికి అడుగు పెట్టేనో లేదో, తాయారమ్మ కొడుకు తగులుకున్నాడు.

"డాక్టర్! అమ్మకి రాత్రంతా కంటి మీద కునుకు లేదంటే నమ్మండి. ఎడ తెరిపి లేకుండా అలా ధారాపాతంగా విరేచనాలు అవుతూనే ఉన్నాయి."

పుండు మీద కారం జల్లినట్లు, తాయారమ్మ ఇంకా ఎమర్జెన్సీ వార్డు లోని వరండా లోనే ఉంది. మేడ మీద గది ఇంకా ఖాళీ అవలేదుట. నాకు జాలి వేసింది. రాత్రి ఏమేమి మందులు ఇచ్చేరో ఒకసారి సింహావలోకనం చేసి చూసేను. నా ఉత్తర్వు ప్రకారం క్లోస్ట్రిడియమ్ డిఫిసీల్‌ని చంపడానికి ఫ్లెజిల్‌ని ఇవ్వడం మాత్రం ఇచ్చేరు. కాని రక్తప్రవాహం లోనికి తిన్నగా వెళ్లేలా సూదితో మందుని ఎక్కించేరు. "పేగులలో ఉన్న సూక్ష్మజీవులని చంపడానికి మందుని నోటి ద్వారా ఇస్తే బాగుండేది కదా" అని నైట్ డ్యూటీలో ఉన్న నరసమ్మలతో నేనంటే , "అలాగే డాక్టర్" అన్నారు వాళ్లు. మనం ఇంకొకళ్లకి పనులు పురమాయించినప్పుడు, సందిగ్ధానికి ఆస్కారం లేకుండా చెప్పక పోతే మనం అనుకునేది ఒకటి, వాళ్లు చేసేది మరొకటి. వైద్యుడుగా మొదలు పెడుతూన్న జీవితంలో మరొక పాఠం నేర్చుకున్నాను.

"కొంచెం ఆవిడ బాధ ఉపశమించేలా చూడండి. 'కేవోపెక్టేట్' కాని 'ఇమ్మోడియం' కాని ఇచ్చి ఆవిడ విరేచనాలని అదుపులో పెట్టండి." అని నరసమ్మలతో చెప్పి చెయ్యగలిగిందంతా చేస్తున్నామని తాయారమ్మ కొడుకుని సముదాయించి, నా పనులలో నేను మునిగి పోయాను.

జబ్బుకి కీలకం అయిన కారణం తెలుసుకోకుండా, బయటకు కనిపించే లక్షణాలను బట్టి వైద్యం చేస్తే ఇలాగే గుడ్డి గుర్రంపు తాపులా ఉంటుంది. పలికితే పలుకుతుంది. లేకపోతే పేషెంటు హరీమనిపోవచ్చు.

మర్నాడు ఉదయమే తాయారమ్మ పక్క పక్కకు చేరుకున్నాను. కనీసం ఈ రోజు వార్డులో పరుపు దొరికింది. విరేచనాల ఉధృతం కొద్దిగా తగ్గిందని విన్నాను. కాని మనిషి ముఖం మాత్రం తేట పడ లేదు.

"రాత్రి కంటి మీద రెప్ప వాల లేదంటే నమ్మి బాబూ" అంటూ మొర పెట్టుకుంది తాయారమ్మ.

అవిడకి వచ్చిన మహామారి రోగం ఏమిటో అంతూ పై తెలియడం లేదు. మలం పరీక్షకి పంపేను కదా. ఆ కోణం ఎలా ఉందో చూద్దామని 'లేబు'కి వెళ్లేను.

"డాక్టర్! ఈ 'స్లయిడ్' ని మీరు ఒక్క సారి చూడాలి, ఇలా రాండి" అని 'టెక్నీషియన్' కేకేస్తే ఏమిటా అని అటు వైపు వెళ్లేను. 'మైక్రొస్కోపు' లోనికి తొంగి చూస్తూన్న టెక్నీషియన్ పక్కకి తప్పుకుని

"'స్ట్రాంజిలాయిడ్లు'! చూడండి." అని నన్ను చూడమని ప్రోత్సహించేడు.

కళ్లజోడు సవరించుకుని, నాకు బాగా కనబడేలా కొంచెం 'ఫోకస్' ఇటూ అటూ తిప్పి, "ఎవరయ్యా, ఈ పేషెంటు?" అని ఆశ్చర్యపోతూ అడిగేను.

"మరెవరో అయితే మిమ్మల్ని ఎందుకు చూడమంటాను? మీ పేషెంటే. టాయారమ్మ" అని తకారోచ్ఛారణ దోషంతో బాధ పడుతూ చెబుతూన్న మా టెక్నీషియన్ మాటలు నమ్మలేక పోయాను. స్లయిడు మీద, మెలికలు తిరిగిన వానపాముల్లా, డజన్ల కొద్దీ ఉన్నాయి, స్ట్రాంజిలాయిడ్లు.

'స్ట్రాంజిలాయిడ్స్ స్టెరాకొరాలిస్' అన్న నోరు నిండేంత పేరున్న ఆసామీ నిజానికి ఒక మిల్లీమీటరు పాటి పొడుగుండే చిన్న పురుగు. సూక్ష్మజీవుల కంటె కొంచెం పెద్దగా ఉండే వీటిని సూక్ష్మంగా స్ట్రాంజిలాయిడ్స్ అన్న ముద్దు పేరుతో పిలవడం కద్దు. ఈ రకం పురుగులని ఇంగ్లీషులో 'పేరసైట్లు' అంటారు. 'పేరసైట్' అంటే మరొకరి మీద ఆధారపడి జీవించే జీవి అని అర్థం. ఒక విధంగా చూస్తే నల్లులు, పేలు, బేక్టీరియా, వైరసులు, వగైరాలన్నీ పేరసైట్లే. ముళ్లపూడి వేంకట రమణ సృష్టించిన అప్పారావు ఒక పేరసైటు. కాని వైద్య పరిభాషలో పేరసైటు అన్న మాట వాడినప్పుడు అవి వైరసుల కంటె, బేక్టీరియా కంటె పెద్దవీ, నల్లులు, పేలు వగైరాల కంటె చిన్నవీ అని అర్థం చేసుకోవాలి. మన కడుపుల్లో ఉండే రకరకాల పురుగులు పేరసైట్లే. వీటిని తెలుగులో పరభాగ్యోపజీవి, పరాన్నభుక్కి, పరభుక్కి, పరాన్నజీవి, ఆర్జవజీవి అని రకరకాలుగా పిలవచ్చు.  సర్వ సాధారణంగా ఉష్ణ మండలాలలో ఉండే ప్రజలకి ఈ ఆర్జవజీవి తగులుకుంటుంది. అంటే, మన పేగులలో తిష్ట వేసుకుని కూర్చుంటుందన్న మాట.

అసలు ఈ ఆర్జవ జీవులు మనిషి శరీరంలో ప్రవేశించడమే ఒక వింత ప్రక్రియ. ఇవి మట్టిలో ఉండే సూక్ష్మమైన జీవులు. కాని మట్టిలో ఉన్నన్నాళ్లూ ఇవి డింభాలు గానే ఉంటాయి. ఈ రకం పురుగులలో బోదకాలుని కలుగజేసే 'ఫైలేరియం' డింభాలు ఒక జాతివి. పాదరక్షలు లేకుండా మట్టిలోనూ, నీళ్లల్లోనూ పని చేసే వాళ్ల చర్మాన్ని దొలుచుకుని ఇవి శరీరం లోకి, అక్కడ నుండి రక్త ప్రవాహం లోకి ప్రవేశిస్తాయి. రక్తం లోంచి ఊపిరితిత్తుల లోకి  చేరతాయి. అక్కడ నుండి ఇవి మన శ్వాస నాళిక లోకి పాకురుకుని వస్తాయి. దగ్గినప్పుడు అవి నోట్లోకి వచ్చి,  మింగినప్పుడు అవి కడుపు లోకి వెళ్లి, అక్కడ నుండి పేగుల లోకి చేరుకుంటాయి. చిన్న పేగులలో జీర్ణమైన ఆహారాన్ని కొంత తస్కరించి, అవి డింభక దశ వదిలి, పెరిగి, పెద్దయి గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు డింభములుగా మారి, మల విసర్జనతో బయటకు వచ్చి మళ్లా మట్టిలో కలుస్తాయి. అక్కడ నుండి మళ్లా మనిషి శరీరంలో ప్రవేశించడం మొదలుకుని ఈ తతంగం అంతా మళ్లా మొదలవుతుంది. అదీ ఈ ఆర్జవజీవుల జీవిత చక్రమూ, జాతక చక్రమూను.

చెప్పడానికి ఎలా ఉన్నా వీటి కథ వినడానికి అసహ్యంగా లేదూ? శుచి, శుభ్రత లేని దేశాలలోనూ, బహిరంగ పారిశుధ్యం పూజ్యమయిన దేశాలలోనూ ఈ ఆర్జవ జీవులదే రాజ్యం. ఎక్కడ పెడితే అక్కడ మలమూత్రాదులు విసర్జించడం, ఆ మట్టితో కల్మషమైన బురద నీటిలో పాదాలకు రక్షణ లేకుండా నడవడం మొదలైన పనులు చేస్తూ ఉంటే ఈ ఆర్జవజీవి సునాయాసంగా చర్మాన్ని దొలుచుకుని శరీరంలో ప్రవేశించ గలదు. ఇలాంటి ప్రమాదాలని దృష్టిలో పెట్టుకుని కాబోలు మనవాళ్లు మడి అనీ, ఆచారం అనీ, ఆడవాళ్లు చెమ్మలో మసిలే అవకాశం ఎక్కువ గనుక వాళ్ల పాదాలకి పసుపు రాసుకోవాలనీ ఏవేవో నిబంధనలు పెట్టి శుచీ, శుభ్రం మనకి అలవాటు చేసేరు.

స్ట్రాంజిలాయిడ్లు అన్ని ఆర్జవజీవుల వంటివీ కావు. వీటికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. ఇవి వాటి అభ్యాగతి శరీరం వదలి పెట్టకుండానే పేగులని దొలుచుకుని, తిన్నగా రక్తప్రవాహంలో ప్రవేశించ గలవు. అలా ప్రవేశిస్తాయి కూడా. అంటే ఏమిటన్న మాట? ఒక సారి శరీరంలో ప్రవేశించేయంటే ఏళ్ల తరబడి అవి రక్తం లోంచి ఊపిరితిత్తుల లోకి, అక్కడ నుండి కడుపు లోకి, అక్కడ నుండి రక్తం లోకి, ..., అలా పచార్లు చేస్తూ ఉంటాయి.

స్ట్రాంజిలాయిడ్లకి మరొక లక్షణం ఉంది. ఇవి ఊపిరితిత్తుల నుండి శ్వాసనాళిక లోకి ప్రవేశించి, అక్కడ నుండి కడుపు లోకి వెళ్లే సమయంలో ఇవి శ్వాసనాళికని వాచేటట్లు చేస్తాయి. అ వాపు వల్ల దగ్గు, ఆయాసం, ఎగ ఊపిరి వస్తాయి. ఇవి చూడడానికి ఉబ్బసం లక్షణాలలా కనిపిస్తాయి. తేడాని పసిగట్టడం చాలా కష్టం.

అభ్యాగతికి జబ్బు చేసినా, లేక పోషణ సరిగ్గా లేక పోయినా, మరే కారణం వల్ల అయినా మనిషి నీరసించినా కడుపులో ఉన్న స్టాంజిలాయిడ్ల జనాభా పెరుగుతుంది. అప్పుడు చిన్న జ్వరం, విపరీతమైన కడుపునొప్పి, విరేచనాలు వచ్చి ఎపెండిసైటిస్ లక్షణాలు పొడచూపుతాయి. ఇవే లక్షణాలతో తాయారమ్మ ఎమర్జెన్సీ వార్డులో చేరింది.

ఉబ్బసం లక్షణాలని అదుపులో పెట్టడానికి ఘృతార్థాలని (స్టీరాయిడ్లని) వాడితే, ఆ స్టీరాయిడ్ల ప్రభావానికి స్టాంజిలాయిడ్లు దినదిన ప్రవర్ధమానంగా పెరిగి వృద్ధి పొందుతాయి. తాయారమ్మ గారికి ఉబ్బసం వచ్చినప్పుడల్లా వాడిన ఘృతార్థాల ధర్మమా అని, ఆవిడ కడుపులో ఉన్న స్టాంజిలాయిడ్లు అల్లారు ముద్దుగా పెరుగుతూ వచ్చేయి. కొనకి కొంప ముంచేయి.

అసలు సంగతి అర్థం అయింది కనుక ఇప్పుడు చికిత్స చిటికెల మీద చెయ్య వచ్చు. తాయారమ్మ శరీరంలో ఏండ్ల తరబడి తిష్ట వేసుకున్న స్టాంజిలాయిడ్ల మీద రాంభాణంలా పనిచేసే మందు ఒకటి ఉంది. దాని పేరు థయోబెంజడోల్.

మరునాడు ఉదయమే థయోబెంజడోల్ ఇద్దామని తాయారమ్మ గారి గది లోపలికి వెళ్లేను. సామానంతా సర్దేసుకుని ఆసుపత్రి గదిని ఖాళీ చెయ్యడానికి సిద్ధంగా ఉన్న తాయారమ్మని చూడగానే ఆశ్చర్యం వేసింది.

''ఇంత బతుకూ బతికి ఇంటెనక్కాల చచ్చినట్లు ఇదేమిటి బాబూ? రాత్రి నుండి చూస్తున్నాను. కుష్ఠు రోగిని చూసినట్లు చూస్తున్నారు, ఈ నర్సులు. నిప్పుని నీళ్లతో కడిగే ఆచారవంతుల ఇంట్లో పుట్టి పెరిగేను. ఆ ముదనష్టపు చైనావాడు వచ్చి నా ఒళ్లంతా పురుగులు పట్టిపోయిందని చెబుతాడా! పైపెచ్చు, అందరూ ముక్కులకీ, మూతులకీ – దూడ పెయ్యల మూతులకి కట్టే బుట్టలులా – తెరలు కట్టుకుని ఏదో అంటురోగిని చూసినట్లు చూస్తారా....?''

నిస్సందేహంగా తాయారమ్మ అహం దెబ్బ తింది.

''మీరు అలా బాధ పడకండి. వైద్యం అర్థం కాని కుర్రకారు ఉద్యోగస్తులు వాళ్లంతా'' అని ధర్మరాజు చెప్పిన అబద్ధం లాంటి అబద్ధాన్ని ఒకటి చెప్పి, ''పడిశం పట్టిన రోగిని చూసి పది బారలు పరిగెత్తే రకాలు వీళ్లంతా. చెరువు మీద అలిగి ఎవరో...'' విరేచనాలతో బాధ పడుతూన్న పెద్ద ముత్తయిదువ ముందు వాడ తగిన సామెత కాదని, నాలుక కరుచుకుని, మధ్యలోనే మాట ఆపీసేను. తాయారమ్మ అర్థం చేసుకుంది.

ఒక మోతాదు మందు ఇచ్చేను. ఏండ్ల తరబడి ఉన్న రోగం ఒక్క మోతాదుతో పొమ్మంటే పోతుందా? మళ్లా మళ్లా మలం పరీక్ష చేయించుకుని మరో రెండు మోతాదులు మందు వేసుకోవాలని చెప్పి ఆవిడని ఆసుపత్రి నుండి విడుదల చేయించేను.

ఆరోగ్యంగా ఉన్నప్పుడు చూసుంటే తాయారమ్మ అందగత్తే అయి ఉంటుందని అనిపించింది. నలభై ఏండ్ల కిందట పట్టు పావడా వేసుకుని కాళ్లకి పారాణి రాసుకుని, శ్రావణ మంగళవారం పేరంటానికి వర్షంలో తడుస్తూ, మొగల్తుర్రు బురదలో నడుస్తూన్న చిన్న తయారుని ఊహించుకుంటున్నాను, ఆవిడ వెళుతూన్న వైపే చూస్తూ. స్టాంజిలాయిడ్ల వంటి క్రిముల బారినుండి రక్షించడానికే కాబోలు పాదాలకి పసుపూ, పారాణీ రాసుకోవాలని మనవాళ్లు ఒక ఆచారాన్ని ప్రవేశ పెట్టేరు. ఏమో, నాకు తెలియదు.

''డాక్టర్ రావ్, ఎమర్జెన్సీ'' అని ఆసుపత్రి లోని లవుడ్ స్పీకర్ మీద పిలుపు వచ్చేసరికి ఈ లోకం లోకి వచ్చి పడ్డాను. మరో రోజు. మరో కేసు.

(టోనీ డేహేర్ రాసిన ట్రయంఫ్ అఫ్ ట్రెచరీ అనే కథ దీనికి అధారం)

(తెలుగుజ్యోతి  సెప్టెంబరు 1995 లో ప్రచురించబడింది.)